క్లుప్తంగా

కాలువల నిర్మాణాలను పరిశీలించిన ఎమ్మెల్యే అన్నా



కాలువల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కంభం: మండలంలోని కందులాపురం పంచాయతీ పరిధిలో కాలువల నిర్మాణాలను గిద్దలూరు ఎమ్మెల్యే అన్నావెంకటరాంబాబు సోమవారం పరిశీలించారు. ఇటీవల జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తులు డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆ సమయంలో ఆయన ఇచ్చిన హామీ మేరకు కాలువలు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. సోమవారం నిర్మాణాలను పరిశీలించిన ఎమ్మెల్యే.. అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

కానిస్టేబుల్ పరీక్షలో డిగ్రీ కాలేజీ విద్యార్థుల సత్తా

యర్రగొండపాలెం: ఏపీ కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలో స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ కళాశాలకు చెందిన 8 మంది విద్యార్థులు టి.కిరణ్, జి.గాయత్రి, షేక్.కరీముల్లా, పి.శ్రీనివాసులు, బి.సాయిమనోజ్, ఎం.కమలాకర్, ఎం.పెద్ద ఏకోబు, ఎ.నాగమ్మ మంచి మార్కులు సాధించి ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత సాధించారు. వీరిని ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ నాయుడు, అధ్యాపకులు పి.రామకోటయ్య, పి.ప్రదీప్, తోటి విద్యార్థులు అభినందించారు.

పంటలకు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

తాళ్లూరు: రబీలో సాగు చేసిన పంటలకు రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు కోరారు. మల్కాపురం, రజానగరం గ్రామాల్లో సోమవారం రైతులతో సమావేశమై ఈ-క్రాప్ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. కౌలుదారులైతే యజమానుల అనుమతితో కౌలుకార్డును, క్రాప్ కల్టివేషన్ రైట్స్ సర్టిఫికెట్ పొందిన తర్వాత ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని కోరారు. రబీలో ఇప్పటి వరకు మండలంలో 25 రకాల పంటలు 2,265 ఎకరాల్లో 751 మంది రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. సర్పంచి షేక్ వలి, వీఏఏ అశోక్ పాల్గొన్నారు.

నేడు గృహసారథులతో సమావేశం

పొదిలి రూరల్: పొదిలి సాయి కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం 10 గంటలకు పొదిలి మండలంలోని 9 గ్రామ సచివాలయాల పరిధిలో నూతనంగా ఎంపికైన గృహసారథులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సదస్సుకు మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మండలంలోని అన్ని సచివాలయాలకు సంబంధించి గ్రామ కమిటీ అధ్యక్షులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు హాజరు కావాలని కోరారు.

శివాలయంలో మహాకుంభాభిషేకం



గోపూజ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి, భక్తులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని శ్రీజగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి దేవస్థానంలో (శివాలయం) సోమవారం నుంచి మహకుంభాభిషేకం నిర్వహిస్తున్నారు. ఈ నెల 8వ తేదీ వరకు ఈ ఉత్సవాలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు. స్వామి వారికి ఉదయం అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 8న బుధవారం మధ్యాహ్నం కుంభాభిషేకం జరుపుతున్నట్లు తెలిపారు. సోమవారం జరిగిన పూజల్లో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి సతీమణి కల్పనారెడ్డి, దేవస్థానం చైర్మన్ కేశవశర్మ పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

బేస్తవారిపేట: పాఠశాల అభివృద్ధికి దాతలు అందించే సహకారం మరువలేనిదని ఎంఈవో జింకా వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, వాలీబాల్ జట్లకు పాఠశాల పూర్వ విద్యార్థి దార్ల పుల్లారావు (పీఈటీ) అందించిన క్రీడా దుస్తులను సోమవారం పంపిణీ చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థులు తమవంతు సహకారం అందించడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. రిటైర్డ్ పీఈటీ వీరయ్య, విద్యార్థులను రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక చేయించిన పీడీ మధుసూదనాచార్యులను పూర్వ విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా పరికరాలను అందిస్తామని పదో తరగతి 93 బ్యాచ్ విద్యార్థులు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కర్నాటి తిరుపతిరెడ్డి, అంబేడ్కర్ ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుల్లా చిన్న సుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తలెత్తుకొని తిరిగేలా సంక్షేమ పాలన

- సమన్వయంతో పనిచేస్తే విజయం మనదే
- గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



కొనకనమిట్లలో కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

కొనకనమిట్ల: కులమతాలు, రాజకీయాలు, అవినీతికి తావు లేకుండా రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తూ నాయకులు తలెత్తుకొని తిరిగే పరిస్థితిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని, వైఎస్సార్ సీపీ కోసం అందరం సమన్వయంతో పని చేస్తే రానున్న ఎన్నికల్లో విజయం మనదేనని మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి స్పష్టం చేశారు. స్థానిక కల్యాణ మండపంలో సోమవారం మండలంలోని అన్ని గ్రామాల గృహసారథులు, వార్డ్ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెద్దవెంకటరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు హబీబుల్లా, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ జగనన్న పాలనలో ఇచ్చిన హామీలతో పాటు మరో 28 పథకాలు అమలు చేసి ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందేలా వలంటీర్ల వ్యవస్థ ద్వారా కృషి చేశామన్నారు. కులమతాలకు, పార్టీ భేదాలు లేకుండా నూటికి నూరుశాతం గడప గడపలో సంక్షేమ కాంతులు నింపిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతోందన్నారు. అదే స్ఫూర్తితో అందరం కలిసి పనిచేసి 2024 ఎన్నికల్లో 175 స్థానాలకు 175 స్థానాలు వచ్చేలా కృషి చేద్దామని ఎమ్మెల్యే కేపీ పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిచేందుకు మీ వంతు కృషి ఉందని వలంటీర్లను ప్రత్యేకంగా అభినందించారు. అదే స్ఫూర్తితో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కలిసి కట్టుగా పని చేసి ప్రజలను పార్టీకి దగ్గరయ్యేలా కృషి చేయాలని కోరారు. అనంతరం పార్టీ సంక్షేమ పథకాల బుక్‌లెట్స్‌ను గృహసారథులకు అందజేశారు. తొలుత ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు పూలతో ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీ గొంగటి జెనీఫా, సచివాలయ కన్వీనర్ ఎస్.పెదవెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, స్థానిక సర్పంచ్ శిగినం లక్ష్మీ తిరుపతమ్మ, ఎంపీటీసీ కల్లం సుబ్బమ్మ దిబ్బారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్‌లు కామసాని వెంకటేశ్వరరెడ్డి, ఉడుముల కాశిరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి చిరుగూరి కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ పునుగోటి కొండారెడ్డి, ఉడుముల గురవారెడ్డి, యక్కంటి తిరుపతిరెడ్డి, పగడాల తిరుపతిరెడ్డి, తాతిరెడ్డి చలమారెడ్డి పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన సేవలందించాలి

- ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాలుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అన్నా

కంభం: ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు నాణ్యమైన సేవలందించాలని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నావెంకటరాంబాబు సూచించారు. సోమవారం వైద్యశాలలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైద్యశాలలోని వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. అదనపు గదుల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కమిటీ సభ్యులు, వైద్యులు సమన్వయంతో ముందుకెళ్తూ అవసరమైన పరికరాలు, సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వైద్యశాలలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని వైద్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఉన్నతాధికారులకు ఫోన్‌లో సమస్య తెలిపి పరిష్కరించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శివనాయక్, వైద్యులు రామలింగమ్మ, విజయ్, శ్రావ్య, ప్రజ్ఞకీర్తి, కిశోర్, జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, ఎంపీడీవో నర్సయ్య, అభివృద్ధి కమిటీ సభ్యులు సబ్బసాని సాంబశివారెడ్డి, కాలె వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీవాల ప్రాణాలు కాపాడేందుకే సంచార వాహనం

- మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల, పక్కన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: మూగ జీవాల ప్రాణాలు కాపాడేందుకే డాక్టర్ వైఎస్సార్ సంచార పశు వైద్యశాల వాహన పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. సోమవారం పొదిలి విశ్వనాథపురంలోని పశు వైద్యశాలకు మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రభుత్వం కేటాయించిన వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూగ జీవాల ఆరోగ్య పరిరక్షణ కోసం 108 తరహాలో ప్రభుత్వం తీసుకొచ్చిన వైఎస్సార్ సంచార పశు వైద్యశాలతో మరింత మంది పాడి రైతులకు సేవలు అందడంతో మేలు జరుగుతుందన్నారు. వైఎస్సార్ సంచార పశు వైద్య సేవలను ఉపయోగించుకోనే వారు టోల్ నంబర్ 1962కు కాల్ చేసి సమస్య తెలపగానే ప్రభుత్వం రైతు ఇంటి వద్దే పశువులకు వైద్య సేవలు అందించే విధంగా చర్యలే తీసుకుందన్నారు. ప్రతి వాహనంలో పశు వైద్యుడు, వెటర్నరీ సహాయకుడు, డ్రైవర్ ఉంటారన్నారు. ఆ వాహనంలోనే జీవాలకు అవసరమైన 20 రకాల మల సంబంధిత పరీక్షలు, 15 రకాల రక్త పరీక్షలు చేసేందుకు మైక్రో స్కోప్‌తో కూడిన చిన్న ప్రయోగశాల ఏర్పాటు చేశారని, దీని ద్వారానే పరీక్షలు చేస్తారన్నారు. పశువులను తరలించేందుకు వీలుగా 1000 కిలోల హైడ్రాలిక్ లిఫ్ట్‌ను కూడా వాహనంలో ఏర్పాటు చేశారన్నారు. పశు సంవర్ధక శాఖ మార్కాపురం డీడీ వెంకట సుబ్బయ్య, ఉన్నగురువాయుపాలెం, గొట్లగట్టు, పెదారికట్ల, కొనకనమిట్ల వైద్యాధికారులు మంచికల మణిశేఖర్, రాజ్యలక్ష్మి, శ్రీకాంత్‌రెడ్డి, అమూల్యా, ఏవో జైన్‌లాబ్దీన్, ఈవోఆర్డీ రాజశేఖర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు ఎస్‌కే నూర్జహాన్‌బేగం, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, మాజీ కన్వీనర్ జి.శ్రీనివాసులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాయి రాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ కె.నరసింహారావు, కె.సుబ్బారావు, వినోద్, ఉడుముల గురవారెడ్డి, కామసాని వెంకటేశ్వరరెడ్డి, పులిగొర్ల శ్రీనివాసులు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలి

- పార్టీ పరిశీలకుడు హబీబుల్లా



హబీబుల్లా, షంషేర్‌ను సన్మానిస్తున్న పీఎల్‌పీ యాదవ్

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ సలహాదారులు హబీబుల్లా కోరారు. సోమవారం బీసీ భవన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్యవేదిక అధ్యక్షుడు షంషేర్ అలీబేగ్, ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ ఆధ్వర్యంలో హబీబుల్లాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్లు సంయుక్తంగా ప్రతి 50 ఇళ్లను తరుచూ సందర్శిస్తూ వారి సంక్షేమం, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ విధంగా కష్టపడుతున్నాడో వివరించాలన్నారు. మైనార్టీ నాయకులు గౌస్ మోహిద్దీన్, ఉస్మాన్, ఖాలీద్, నాగం రామకృష్ణ, జానీబాషా, శివప్రసాద్ పాల్గొన్నారు.

గిద్దలూరు వైద్యశాల అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: స్థానిక ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి అందరం కలిసి కృషి చేయాలని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. స్థానిక ఏరియా వైద్యశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఓపీ సేవలను మరింత మెరుగుపరచాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందించే వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ప్రభుత్వ వైద్యశాలలపై ప్రజలకు పూర్తి నమ్మకం కలిగించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం ప్రైవేటు వైద్యశాలలకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలలను తీర్చిదిద్దుతోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సూరిబాబు, వైద్యశాల కమిటీ అధ్యక్షుడు డాక్టర్ జేవీ నారాయణ, సభ్యులు, సిబ్బంది, పాల్గొన్నారు.

వ్యక్తిగత విమర్శలు దుర్మార్గం

తర్లుపాడు: తనపై, తన భర్తపై తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల నారాయణరెడ్డి వ్యక్తిగత విమర్శలు చేయడం దుర్మార్గమని ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి అన్నారు. సోమవారం తర్లుపాడులోని తన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ఆదివారం మండలంలోని కేతగుడిపి గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు టీడీపీలో చేరినట్లు తప్పుడు సమాచారం సోషల్ మీడియాలో ప్రచారం చేస్తుంటే ఆ విషయాన్ని తాను ఖండిస్తూ ప్రెస్‌నోట్ రిలీజ్ చేసినట్లు పేర్కొఆన్నరు. ఆరోపణలకు సమాధానం చెప్పకుండా గొల్లపల్లిలో నిర్వహించిన టీడీపీ కార్యక్రమంలో మహిళనని చూడకుండా తనపై అనుచిత వ్యాఖ్యాలు చేసి, తన భర్తపై నిరాధార ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయంలో మీరు మీ తమ్ముడు భూ దాహానికి రెవెన్యూ సిబ్బంది బలైన సంఘటనలు ప్రజలు మర్చిపోరన్నారు. టీడీపీ ఎప్పటికి అధికారంలోకి రాదని, ఓట్ల కోసమే బీసీ జపం చేస్తున్నట్లు విమర్శించారు. సమావేశంలో పార్టీ అధ్యక్షుడు మురారి, సర్పంచ్‌లు వరాలు, పెద్ద మస్తాన్, శ్రీనివాస్‌రెడ్డి, రామిరెడ్డి, వెంకటరెడ్డి, షజహాన్ రసూల్, కో ఆప్షన్ సభ్యులు అక్బర్‌అలీ, నాయకులు మంద కొండారెడ్డి, హరి, శేషయ్య పాల్గొన్నారు.

పకడ్బందీగా మహాశివరాత్రి ఏర్పాట్లు

త్రిపురాంతకం: మహాశివరాత్రి మహోత్సవాలను బాలాత్రిపురసుందరీదేవి, పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల్లో వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తహసీల్దార్ వి.కిరణ్ పేర్కొన్నారు. శివరాత్రి మహోత్సవాలపై స్థానిక బాలాత్రిపురసుందరీదేవి ఆలయం వద్ద అధికారులతో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. మహాశివరాత్రికి భారీగా భక్తులు రానున్నారని దానికి తగిన విధంగా ఏర్పాట్లు, సౌకర్యాలు, విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రెవెన్యూ, దేవదాయ అధికారులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ.. ఆలయాల వద్ద భక్తుల క్యూలైన్లు, విద్యుత్, తాగునీరు, ఇతర అవసరాలు ప్రత్యేక పూజల ఏర్పాట్లను వివరించారు. ఈ నెల 18న ఉత్సవాలు, 20న రథోత్సవం వైభవంగా నిర్వహించేందుకు భక్తులు, సేవా సంస్థలు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్ పద్మజ మల్లికార్జున్, సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, విద్యుత్ ఏడీఈ సాంబశివరావు, ఎంపీడీఓ మరియదాస్, ఈఓఆర్డీ మురళీమోహన్, డాక్టర్ నాగేశ్వరరావునాయక్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటరమణ, ఏఈ హనుమాన్‌బాబు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, సత్రాల నిర్వాహకులు, అధికారులు పాల్గొన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గిద్దలూరు వాసికి స్థానం

గిద్దలూరు రూరల్: తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గిద్దలూరు మండలం పొదలకుంటపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న మొర్రి పిచ్చయ్యయాదవ్‌కు స్థానం లభించింది. యశ్వంత్ ఎడ్యుకేషన్ సొసైటీ స్థాపించి 15 సంవత్సరాల నుంచి విద్యార్థులకు అనేక విధాలుగా ఆర్థికసాయం అందజేస్తూ ప్రోత్సాహించడమే కాకుండా సమాజంలో వారి సంస్థ తరఫున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడాన్ని గుర్తించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అధ్యక్షుడు చింతపట్ల వెంకటాచారి హైదరాబాద్‌లో పిచ్చయ్య యాదవ్‌తో పాటుగా ఆయన సతీమణి మొర్రి తిరుపతమ్మను ఘనంగా సన్మానించి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

రక్తపింజరను బంధించిన స్నేక్ క్యాచర్

పెద్దదోర్నాల: మండల పరిధిలోని యడవల్లి గ్రామంలో రైతు వెంకటేశ్వరరెడ్డి పొలంలో సంచరిస్తున్న ప్రమాదకర రక్తపింజర(రస్సెల్ వైపర్)ను స్నేక్ క్యాచర్ రహీం సోమవారం బంధించారు. పామును గమనించిన కూలీలు దోర్నాల అటవీ రేంజ్ కార్యాలయానికి సమాచారమందించారు. దీంతో స్పందించిన అధికారులు స్నేక్ క్యాచర్లు షేక్ రహీం, కోటపాటి శివను రంగంలోకి దించారు. 5 అడుగుల పొడవున్న రక్తపింజరను నల్లమల అభయారణ్యంలో వదిలిపెట్టనున్నట్లు పెద్దదోర్నాల రేంజి అధికారి విశ్వేశ్వరరావు తెలిపారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి చేయూత

తాళ్లూరు: గుండెపోటుతో మరణించిన ఆటో డ్రైవర్ గురునాథం పీటర్ పాల్ (37)కు ఆటో డ్రైవర్ల సంఘం చేయూత ఇచ్చింది. ప్రభుత్వం వైఎస్సార్ బీమాను మంజూరు చేయగా ఆటో వర్కర్స్ యూనియన్ కుటుంబ సాధారణ ఖర్చుల కోసం మూడు బస్తాల బియ్యం సోమవారం ఆయన భార్య మనోహరమ్మకు అందించారు. ఆపదలో ఉన్న తమ ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆదుకునేందుకు తమ వంతు చేయూత ఇచ్చినట్లు సంఘ సభ్యుడు పులుగు చిరంజీవి తెలిపారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఘన స్వాగతం

గిద్దలూరు రూరల్: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కె.రవిబాబుకు స్థానిక అటవీశాఖ అతిథి గృహం వద్ద జిల్లా ట్రైబర్ వెల్ఫేర్ ఆఫీసర్ జగన్నాథరావు సోమవారం ఘనంగా స్వాగతం పలికారు. నేడు మండలంలోని దిగువమెట్ట గ్రామ పరిసరాల్లో రవిబాబు పర్యటించనున్నారు. ఎస్టీలకు సంబంధించిన సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ఆయన పర్యటించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

ముండ్లమూరు: గ్రామాల్లో మహిళా పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎల్.సంపత్‌కుమార్ సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం సచివాలయ మహిళా పోలీసులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. అపరిచిత వ్యక్తులతో ప్రజలను అప్రమత్తం చేసి అలాంటి వారి సమాచారం వెంటనే తెలియజేయాలన్నారు. ఆలయాల మత పెద్దలతో మాట్లాడి హుండీలకు సరైన భద్రత ఉండేలా చూడాలన్నారు.

ఉత్తమ ఫ్యామిలీ ఫిజీషియన్‌లుగా తాళ్లూరు వైద్యులు



కలెక్టర్ నుంచి అవార్డులు అందుకున్న వైద్యులు

తాళ్లూరు: ఉత్తమ ఫ్యామిలీ ఫిజీషియన్‌లుగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు అవార్డులు అందుకున్నారు. తాళ్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌బీ వితలాపురం సచివాలయం పరిధిలో ఉత్తమ ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు అదించినందుకు, మరో వైద్యుడు హనుమానాయక్ శివరామపురం సచివాలయ పరిధిలో ఉత్తమ సేవలు అందించినందుకు అవార్డు అందుకున్నారు. కలెక్టర్ దినేశ్‌కుమార్ సోమవారం ఒంగోలు స్పందన హాల్‌లో వారికి అవార్డులు అందించారు.

భద్రత ప్రమాణాలు పాటించాలి

పొదిలి రూరల్: గ్యాస్ వినియోగదారులు భద్రత ప్రమాణాలు పాటించాలని జిల్లా ఇండేన్ గ్యాస్ డిప్యూటీ మేనేజర్ దుగ్గినేని భాస్కర్‌రావు అన్నారు. సోమవారం కరుణ ఇండేన్ గ్యాస్ అధ్వర్యంలో పొదిలి కేజీబీవీ పాఠశాల విద్యార్థినులకు గ్యాస్ వాడకంపై అవగహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్లో నూతనంగా ప్రవేశ పెట్టిన ఫైబర్ గ్యాస్ సిలిండర్, 5 కేజీల చిన్న సిలిండర్ల ఉపయోగాలు, గ్యాస్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాయి రాజేశ్వరరావు, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది, కేజీబీవీ ఉపాధ్యాయినులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూముల రక్షణ కోసం రౌండ్‌టేబుల్ సమావేశం

దర్శి: ప్రభుత్వ భూముల రక్షణ కోసం ప్రభుత్వ వైఖరి.. అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం రాష్ట్ర దళితసేన, మాదిగ మహానాడు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. కార్యక్రమానికి కండ్లకుంట మార్కు అధ్యక్షత వహించారు. నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు, డప్పు కళాకారుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రసాద్, రాష్ట్ర దళిత సేన నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జి. ప్రేమ్‌కుమార్, మహానాడు దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి గట్టుపల్లి ప్రసాద్ పాల్గొన్నారు. దర్శి నగర పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 740లో ప్రభుత్వ భూమి ఉన్నా ఇతరులు ఆక్రమించే పరిస్థితి ఉందన్నారు. అంబేడ్కర్ సామాజిక భవనం కోసం ప్రతి స్పందనలో అర్జీలు ఇచ్చినా స్పందించటం లేదని వారు పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సింగంశెట్టి హనుమంతరావు, ఆంజనేయులు, జూపల్లి కోటేశ్వరరావు, గుంటూరు ఏసుదాసు, ఎరుకల హక్కుల సంఘ జిల్లా నాయకులు లోకసాని రత్నం, యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగారావు, ప్రకృతి వ్యవసాయ వైద్య నిపుణులు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ న్యాయ నిర్ణేతలుగా కళ్యాణ్‌సాయి, మణికంఠ

పొదిలి రూరల్: హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈ నెల 5న 3వ నేషనల్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు రెఫరీలుగా పొదిలి పట్టణానికి చెందిన కరాటే మాస్టర్లు వడ్డే కల్యాణ్ సాయి, వేముల లీల, మణికంఠ వ్యవహరించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటుడు సుమన్ హాజరై తిలకించారు. రిఫరీలుగా వ్యవహరించిన కళ్యాణ్‌సాయి, మణికంఠ లను ఉత్తమ న్యాయ నిర్ణేతలుగా ప్రకటించారు. వీరికి సుమన్ చేతుల మీదగా జ్ఞాపికలు అందజేసి శాలువతో సన్మానించినట్లు కళ్యాణ్‌సాయి తెలిపారు.

ఐకాస రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అర్లయ్య

తర్లుపాడు: ఏపీ ఐకాస అమరావతి నూతన కార్యవర్గ ఎన్నికల్లో భాగంగా మండలంలోని కలుజువ్వలపాడు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వేల్పుల అర్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కర్నూలులో జరిగిన మూడో రాష్ట్ర మహసభలో అధికారికంగా ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

నవోదయ పరీక్షకు ఉచిత శిక్షణ

పొదిలి రూరల్: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నవోదయ పరీక్షపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి చెప్పారు. పొదిలి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం, సాయంత్రం సమయాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తునట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విదార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

పొదిలి రూరల్: పొదిలి ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సుందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. పొదిలి ఆర్టీసీ డిపో పరిధిలో ఉన్న సమస్యలను డయల్ యువర్ డీఎం కార్యక్రమం ద్వారా తెలియజేయాలన్నారు. ముఖ్యంగా సర్వీసుల సమయాలు, ట్రిప్పుల వివరాలు 99592 25700 నంబర్‌లో తెలుసుకోవచ్చన్నారు.

రమణారెడ్డికి ఏపీటీఎఫ్ మద్దతు

కురిచేడు: తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎల్‌సీ రమణారెడ్డికి ఏపీటీఎఫ్ మద్దతు ఇస్తోందని ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దనరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో సోమవారం ఏపీటీఎఫ్ కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అండగా ఉండే రమణరెడ్డికి అందరూ మద్దతు తెలపాలని కోరారు. మండల శాఖ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, ఏటీఎఫ్ బాధ్యులు ఎస్‌వీఎల్ సుబ్బారావు, వి.స్వాతి, కె. మహితేజ, టి.వీరాంజనేయులు, సీహెచ్ శివరామకృష్ణ పాల్గొన్నారు.

జిల్లా వైద్యశాలలో హెపటైటిస్-బి వ్యాక్సినేషన్

మార్కాపురం: స్థానిక జిల్లా వైద్యశాలలో హెచ్ఐవీ పాజిటివ్ ఉన్న వారికి హెపటైటిస్-బి వ్యాక్సిన్ సోమవారం నుంచి ఉచితంగా వేస్తున్నట్లు ఏఆర్‌టీ సెంటర్ డాక్టర్లు చాగంటి సాయికిరణ్‌రెడ్డి తెలిపారు. హెపటైటిస్-బి రాకుండా ముందస్తుగా నివారించేందుకు టీకాలు ఉచితంగా వేస్తామని చెప్పారు. తమ పరిధిలో మొత్తం సుమారు 3 వేల మందికి వ్యాక్సిన్ వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. డాక్టర్ హర్షవర్ధన్, సిబ్బంది మురళి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వితలాపురం సర్పంచిపై కేసు

తాళ్లూరు: వితలాపురం సర్పంచి మారం ఇంద్రసేనారెడ్డి, తాళ్లూరుకు చెందిన కె. నాగార్జునరెడ్డిపై ఎంపీడీఓ కేవై కీర్తి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. వితలాపురం పంచాయతీ పరిధిలో నాలుగు ఉపాధి పనులకు ప్రభుత్వం రూ.54,68,835లు విడుదల చేసింది. ఆ పనులు వితలాపురానికి చెందిన మానం రమేష్‌బాబు, రమణాలవారిపాలేనికి చెందిన కాలేషాబాబులు చేసినట్లు రికార్డులో ఉంది. సర్పంచి ఇంద్రసేనారెడ్డి ఆ నగదును మోసపూరితంగా, డూప్లికేట్ డాక్యుమెంట్లు సృష్టించి నాగార్జునరెడ్డికి చెల్లించారు. అంతేగాక మరో పని కాలేషావలి చేయగా మెటీరియల్ నగదును సర్పంచి స్వతహాగా తన చెక్కు ద్వారా రూ.11,97,554ను డ్రా చేశారు. సర్పంచి తన అధికారాన్ని దుర్వినియోగం చేసి నిధులు డ్రా చేసి ఇతరులకు ఇవ్వటం, తాను వాడుకోవటంపై పంచాయితీరాజ్ అధికారులు కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ కీర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.